# ఈనాడు
THE HEART AND SOUL OF ANDHRA PRADESH

April 19, 2006


## 'టాంటెక్స్' ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవాలు



డల్లాస్‌లోని 'టాంటెక్స్' ( తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ టెక్సాస్) ఆధ్వర్యంలో వ్యయ నామ సంవత్సర ఉగాది వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి దాదాపు 700 మందికి పైగా ప్రవాసాంధ్రులు హాజరు కావడం విశేషం. స్థానిక పురోహితుడు శ్రీహరి పంచాంగ శ్రవణంతో కార్యక్రమం ప్రారంభమయింది. టాంటెక్స్ అధ్యక్షుడు మూర్తి మూలుకుట్ల ప్రసంగిస్తూ ఉగాది విశిష్టతను సభికులకు వివరించారు. కళ్యాణి తాడిమెటి కూర్పు చేసిన బాలల నృత్యం ప్రదర్శించిన అనంతరం పద్మశొంటి కూర్పు చేసిన 'స్తోత్ర కదంబం' సంప్రదాయబద్ధంగా ప్రదర్శితమైంది. ప్రత్యేక కార్యక్రమాలకు ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న తోటకూర ప్రసాద్ సభకు సుధారాణి చవను పరిచయం చేశారు. ' డి-మీడియా'కు మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న ఆమె ప్రఖ్యాత గజల్ కళాకారుడు గజల్ శ్రీనివాస్ అమెరికా యాత్రకు రూపకల్పన చేశారు. 18 ఏళ్ల వయస్సులోనే ఆమె విజయవాడ నగర పాలక సంస్థకు కార్పొరేటర్‌గా (1988) ఎన్నికైన విషయాన్ని తోటకూర సభికులకు తెలిపారు. టాంటెక్స్ అధ్యక్షుడు మూర్తి మూలుకుట్ల , సాంస్కృతిక సంఘ ఛైర్మన్ గీతా దమ్మన్నలు ఆమెకు జ్ఞాపికను బహూకరించారు.



తెలుగులో గజల్స్‌కు విశేష ప్రాచుర్యం కల్పించిన గజల్ కళాకారుడు గజల్ శ్రీనివాస్‌ను తోటకూర ప్రసాద్ సభకు పరిచయం చేశారు. టాంటెక్స్ అధ్యక్షుడు, ట్రస్టీబోర్డు ఛైర్మన్ 'గజల్ గాన చక్రవర్తి' బిరుదుతో సత్కారం చేశారు. అనంతరం గజల్ శ్రీనివాస్ తన గజల్ గానంతో సభికులకు రసరమ్యమైన అనుభూతిని కల్పించారు. " పరుల కోసం పాటు పడుదాం " ( ఈ గీతాన్ని జ్ఞానపీఠ్ అవార్డ్ గ్రహీత నారాయణరెడ్డి రచించారు ) " ఇప్పుడు ఇల్లులా లేనే లేదు " ( య డా. రెంటాల రచన) " ఒక్క సారి వూరుకి పోయి రా" " మరల వస్తావో రావో" అన్న గీతాలకు ప్రేక్షకుల నుంచి విశేషస్పందన లభించింది. గజల్ శ్రీనివాస్ నిర్వహిస్తున్న స్వచ్ఛంద సంస్థకు టాంటెక్స్ సభ్యుడు మనోహర్ రెడ్డి వేయి డాలర్లను విరాళంగా ప్రకటించారు.



రాజేష్ చిలుకూరి బృందం 'అసెంబ్లీ రౌడీ' హాస్యనాటకాన్ని శశి తాడిపల్లి బృందం ' డ్యాన్స్ మిడ్లే' నృత్యాన్ని ప్రదర్శించారు. ఆస్టిన్‌లోని టెక్సాస్ విశ్వవిద్యాలయంలో వచ్చే విద్యాసంవత్సరం నుంచి తెలుగు భాషా కోర్సులను ప్రవేశపెడుతున్నట్టు తానా ప్రకటనపై సభికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి ప్రాయోజికులుగా వ్యవహరించిన తానా, జెమ్స్, హమ్-తుమ్ రేడియో, తబ్లా ఇండియన్ బిస్ట్రో, తిలక్ జ్యువలర్స్, డిస్కవర్ ట్రావెల్... తదితర సంస్థలకు టాంటెక్స్ ప్రతినిధి శ్యామల రుమాల్లా కృతజ్ఞతలు తెలిపారు.